# జాతి రత్నాలు బాపు-రమణ

నమోవాక్యం : వసుంధర

ఏ రంగంలో చూసినా- మానవజాతి ప్రగతిపథంలో 20వ శతాబ్దం విశిష్టమైనది. భౌగోళికంగా, ఆర్థికంగా ప్రపంచదేశాల మధ్య ఎల్లలు తొలగిపోతున్నాయి. వైజ్ఞానికంగా పరమాణుశక్తి, ఎలక్ట్రానిక్ సాధనాలు, అంతరిక్షయాత్రలు, కంప్యూటర్లు- మనిషి జీవితాన్ని ఊహించని స్థాయికి తీసుకు పోతున్నాయి. ఈ శతాబ్దంలోనే- వీటన్నింటికీ దీటురాగల అద్భుతాలు తెలుగు సాహితీ రంగంలో జరగడం విశేషం. శ్రీశ్రీ, గురజాడ, చలం, విశ్వనాథ- ప్రభృతులు వివిధ సాహితీ ప్రక్రియల్లో యుగపురుషులనిపించుకోగా- అనుసరించిన మరెందరో మహానుభావులు- వారి వెనుక కాక- సరసన స్థానం సంపాదించుకుని- సాహితీపరంగా తెలుగునేల రత్నగర్భ అని ఋజువు చేసిన శతాబ్దమది. ఆ మహానుభావుల స్థాయి తెలుసుకుందుకు మచ్చుకో పేరు చెప్పమంటే- ఎవరి నోటైనా పలికే పదం బాపు-రమణ.

నిజానికి బాపు-రమణ ఇద్దరు. వారిలో బాపు- గీతల్లో గీతను పలికించే సాహితీవేత్త. రమణ- రాతల్లో గీతను చూపించే చిత్రకారుడు. జీవ రసాయనశాస్త్రంలో ఒక బెంజీన్ అణువు- రెండు స్ట్రక్చర్ల రిజోనెన్సుకు ప్రతిరూపం కావడం నిజమైనట్లే- బాపు-రమణ ఒక్కరే! వారి ప్రసక్తి వస్తే- చెప్పేవారూ, వినేవారూ గుర్తుంచుకోవాల్సిన విశేషమిది.

ఆంధ్రపత్రిక పత్రికాలో కాన్వోలేస్తున్న రోజుల్లో బాపు-రమణలంటే మా కాలేజిలో పెద్ద క్రేజ్. జ్యోతి మాసపత్రిక ప్రారంభమైనప్పుడు మా యూనివర్సిటీలో వారంటే చెప్పలేనంత మోజు. ఐతే



'బాపురమణీయం' ఆవిష్కరణోత్సవ సభలో...




బాపు-రమణ గురించి మాట్లాడాలనుకునే ఎవరికైనా- వారి గురించి తమకు తెలిసిందానికంటే ఇతరులకు తెలిసిందే ఎక్కువని భయం. అదే భయం మిగతా అందరిలోనూ ఉన్నప్పటికీ - ఆ జంట గురించి ఇంకాఇంకా తెలుసు కోవాలన్న ఆరాధనాపూర్వకమైన అభిలాషే ఆ చర్చల కొనసాగింపుకు కారణమయ్యేది. ఐనా అవగాహనకు- ఏనుగు ముందు గుడ్డి వాళ్ళకున్న పరిమి తులుండేవి. ఇప్పుడు మేము చెప్పే నాలుగు మాటలకూ కూడా ఆ పరిమితి వర్తిస్తుందని మనవి.

'ఈ శతాబ్దం నాది' అనతగ్గ చిత్రకారుడు బాపు. బ్రహ్మగీత స్త్రీకి జీవితగతిని నిర్దేశిస్తే- బాపు గీత బొమ్మను అందగత్తెనుచేసి- స్త్రీసౌందర్యాన్ని నిర్వచించింది. రాక్షసులనైనా, పురాణపు రుషులనైనా చిన్ని గీతలలో ఇమడ్చడం ఆయన ప్రత్యేకత. గాలిబ్ ఊహల్లో ప్రియురాలికైనా, మన మధ్య మసిలే బుడుగు, బామ్మ, గోపాలం, రాధ, బాబాయ్, పక్కింటి లావుపాటి పిన్నిగారు, అప్పారావు, రెండుజెళ్ళసీత, సుబ్బరాజు, భానుమతి అత్తగారు, గురజాడ గిరీశం వగైరా వ్యక్తిత్వాలకైనా- ఆయన చేసిన రూపకల్పన మరపురానిది. 'అచిరకాలంలోనే ఆదుర్తి, ఆర్జించాడు ఘనకీర్తి. అప్పుడప్పుడు అరసగం తగ్గిపోయినా అర్థంటుగా చేసుకుంటాడు భర్తీ' అంటూ కార్టూనుల్లో హాస్యానికి లోతైన అవగాహనను జతపర్చగల అసాధారణప్రజ్ఞ ఆయనది. 'నవ్వుపార్థం




చేసుకోకు సుశీ! ఈవిడ మా అమ్మ' అని తల్లి వేలు పట్టుకుని నడుస్తున్న ఆరేడేళ్ళ కుర్రాడు తన వయసు అమ్మాయికిస్తున్న సంజాయిషీ, 'రోజూ భోజనానికి ముందు- యాక్- ఓ చెంచాడు పుచ్చుకోండి' అంటూ రోగికి మందిచ్చే కాంపౌండరు, 'మళ్ళీ పడ్డారా' అనడిగిన భార్యకు 'లేదు, ఇందాకా పడ్డదే- ఇంకా లేవలే' అని చెప్పుకునే భర్త, 'వాడి జీడిపాకంమీద కూర్చున్నట్లున్నారు'- వగైరా ఆయన కార్టూనులు బొమ్మకూ వ్యాఖ్యకూ ఉన్న అవినాభావసంబంధానికి మచ్చుతునకలు. బంగారం-సింగారం అప్పట్లో హాస్యప్రియులనుర్రూతలూగించిన ఉత్కంఠభరితమైన బొమ్మలకథ. ఆయన దర్శకత్వంలో వచ్చిన సాక్షి, సీతాకళ్యాణం, మన ఊరి పాండవులు వగైరాలు నిజంగా 'చలన'చిత్రాలే! కేవలం బాపు బొమ్మలకోసం 'గాలిబ్ గీతాలు' కొని- తర్వాత ఆ కవితామాధుర్యాన్నాస్వాదించిన అనేకుల్లో మేమూ ఉన్నాం. ఒక వయసులో బామ్మ ప్రేరణతో చిత్రకళాభ్యాసం చేసి- 'సాధనమున పనులు సమకూరు ధరలోన' అన్న వేమన సూక్తి బాపు స్థాయికి వర్తించదని తెలుసుకున్నాం.

హాస్య వ్యంగ్య రచనలకు కథాపరంగా- 'ఈ శతాబ్దం నాది' అనతగ్గ రచయిత రమణ. సీతాకళ్యాణం వంటి పురాణగాథలను వచనకవితలనిపించే కథలుగా రూపొందించగల రమణ- ప్రేమకథల్లో ఏకలవ్యుడు. ఇద్దరమ్మాయిలూ ముగ్గురబ్బాయిలూ ద్వారా



కొత్త శకానికి ఒరవడి పెట్టారు. తాను సృష్టించిన ప్రతిపాత్రనూ- పాఠకుల కళ్ళకు కట్టించగల రమణ- 'ఋణానందలహరి'తో అప్పారావునూ, 'బుడుగు చిచ్చర పిడుగు'తో బుడుగునూ- సృష్టించారు. 'గిరీశం లెక్చర్లు' కన్యాశుల్కం కంటే మిన్నగా గిరీశం ప్రాభవాన్ని పెంచాయి. సమకాలీన రాజకీయాలను 'రాజకీయ బేతాళ పంచవింశతిక'తోనూ, సినీ ప్రపంచాన్ని 'విక్రమార్కుడి మార్కు సింహాసనం'తోనూ- లోతుగా విశ్లేషించి సర్వకాలీనమైన పరిచయం చేసారు. చలనచిత్ర సమీక్షను కథలంత ఆకర్షణీయం చేసిన ఘనత ఆయనది. 'మేడమీద మేడకట్టి' (ప్రేమించి చూడు) అన్న సినీ గీతంలో- అప్పటికీ ఇప్పటికీ ఎప్పటికీ అపూర్వమనిపించే పదవిన్యాసం- వీరు మరిన్ని సినీగీతాల నెందుకు రచించలేదా అనిపింపజేస్తుంది. కాలేజి రోజుల్లో వారి రచనలు చదవడం ఓ ఫాషన్. యూనివర్సిటీలో ఉండగా ఆరంభమైన జ్యోతి మాసప

త్రిక వారి కారణంగా ఓ సెన్సేషన్. 'రక్తసం బంధం'తో ప్రతిభను చాటి- 'ప్రేమించి చూడు', 'బుద్ధిమంతుడు', 'అందాల రాముడు' వగైరాలతో అనన్యసామాన్యంగా రాణించి, 'ముత్యాలముగ్గు'లో విశ్వరూపాన్ని ప్రదర్శించిన వారంటే ఎందరికో అడ్మిరేషన్. మాబోటి రచయితలకు వారో గొప్ప ఇన్స్పిరేషన్. తెలుగు కథకు కొత్త భాషనిచ్చారు. తెలుగు పాత్రల్లో కొత్త జీవాన్ని నింపారు. తెలుగునాట హాస్యానికి కొత్త ఒరవడి పెట్టారు. బాపు అంతటి వానితో సమైక్యమై చిత్ర విచిత్రాలు చేసారు. నాటకాల్లో 'కన్యాశుల్కం'లా, సినిమా స్క్రిప్టుల్లో 'ముత్యాల ముగ్గు' నభూతో నభవిష్యతి.

బాపు-రమణల మేలు కలయిక విశ్వరూపం- బుడుగు, బొమ్మల రామాయణం, శ్రీకృష్ణలీలలు వగైరా రచనల్లోనూ- బుద్ధిమంతుడు, అందాల రాముడు, సంపూర్ణ రామాయణం, మిస్టర్ పెళ్ళాం, పెళ్ళిపుస్తకం వగైరా చలనచిత్రాల్లోనేకాక- ప్రచారమాధ్యమంలోనూ ప్రదర్శితమైంది. 'ఉఁరేయ్- కుంచెం ఆగు' (బుడుగు పుస్తకం), 'పద్మశ్రీవారి సమ్మోహనాస్త్రం' (ప్రేమించి చూడు చిత్రం), తెలుగు చలనచిత్రరంగంలో ఇది 'సాక్షి నామ సంవత్సరం' (సాక్షి చిత్రం) వగైరాలు ఏళ్ళు గడిచినా మరపురాని వ్యాఖ్యలు. 'బంగారు పిచ్చుక' పాటలపుస్తకం గొప్ప ప్రయోగం. రంగారావును సాక్షి రంగారావును చేసిన ఘనత వీరిదే. అల్లు రామలింగయ్య (మూగ మనసులు), రావు గోపాలరావు (ముత్యాలముగ్గు), ఏవీయస్ (మిస్టర్ పెళ్ళాం)- వంటి ప్రతిభావంతుల నటజీవితానికి ఈ జంట ఇచ్చిన మలుపు జగద్విదితం. 'పెళ్ళిపుస్తకం'లో డైలాగ్ డెలివరీ ద్వారా గుమ్మడి పాత్రకు వారాపాదించిన విలక్షణత అనితరసాధ్యం. లంచానికి ఆమ్యామ్యా (బుద్ధిమంతుడు), పదవి ఊడినవాడికి తీతా (అందాల రాముడు), నేరాల బేరానికి- మర్డరు కెంతవుద్దీ (ముత్యాలముగ్గు), తృప్తికి తుత్తి (మిస్టర్ పెళ్ళాం)- పర్యాయపదాలుగా తెలుగునాట ప్రాచుర్యం పొందడం- వీరి పదశక్తికి మచ్చుతునకలు.

బాపు-రమణ తెలుగు జాతికి దేవుడిచ్చిన వరం. వారి 'పలుకు'బడి సుమనోహరం. వారి ప్రతిభ అజరామరం. వారికి సమకాలీనులు కావడం మనందరికీ గౌరవం. అవార్డులు వారికి కాదు, అవార్డులకే వారు సత్కారం. జ్ఞానసూర్యుడి ప్రచండతేజాన్ని స్వీకరించి భరించి- జాతికి వెన్నెలలు ప్రసరించే రసరాజులు ఉత్పల మానస చోరులనేమో- పద్మాలంకృతులు కాలేదు. సాహితీ సామ్రాజ్యంలో ధర్మం నాలుగు పాదాలా నడిచే కృతయుగం వారిది. ఆ జంటకు షష్టిపూర్తి జరిగితే అది నూత్నయౌవనమనడం యుగధర్మం. 'నిత్యపెళ్ళికొడుకు'ను సృష్టించిన ఆ నిత్యయౌవనులకు మా నమస్సుమాంజలులు.




◆